నేలపాలైన టమాట పంట

- ధరలేక చేనులోనే వదిలేసిన రైతులు
- మార్కెట్‌లో ధర లేక నష్టాల బాట
- గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- పెట్టుబడి పెట్టి భారీగా నష్టపోయిన అన్నదాతలు

నాగిరెడ్డిపల్లి గ్రామంలో చేనులోనే వదిలేసిన టమాట పంట

కోహీర్, ఫిబ్రవరి16: మూడు నెలల పాటు చెమటోడ్చి పండించిన టమాట పంట నేల పాలైంది. లాభాలు వస్తాయనే ఆశతో సాగు చేసిన పంట చేనులోనే వృథాగా పడి ఉంది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతన్నలకు నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించకున్నా ఏదోవిధంగా కష్టపడి పండించిన టమాట రైతులను నష్టాల బాట పట్టించింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు పుష్పమ్మ ఒక ఎకరాలో టమాట పంటను సాగు చేసింది. చేను దున్నకం, నారు కొనుగోలు, కలుపు తీత, మందుల వినియోగానికి రూ.40వేలకు పైగా వెచ్చించింది. పంట ఏపుగా పెరిగింది. పూత, కాత బాగానే కాసింది. పంట చేతికందే సమయంలో మార్కెట్ ధర పడిపోయింది. కిలో టమాటలు పది రూపాయలకు కూడా కొనలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో మార్కెట్‌కు తరలిస్తే ఎలాగు డబ్బులు వచ్చే అవకాశాలు లేవు. దీంతో చేనులోనే వదిలేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక్కసారి టమాటలు ఆటోలో మార్కెట్‌కు తరలించారు. ఇందు కోసం రూ.వెయ్యి చార్జిలను చెల్లించారు. కానీ ఒక్క రూపాయి కూడా రైతు చేతికి అందలేదు. తద్వారా మార్కెట్‌కు తరలిస్తే ఎలాగైనా నష్టం వస్తుందని నిరాశకు లోనయ్యారు. కూలీల ఖర్చు భరించలేక చేనులోనే వదిలేశారు. టమాటతో పాటు వంకాయ తోటను సాగు చేస్తున్న రైతుకు నష్టం మాత్రమే మిగులుతున్నది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు పుష్పమ్మ కోరింది.

ధర లేకనే విడిచిపెట్టినం...

ఒక ఎకరం చేనులో టమాటను పండిస్తున్నా. రూ.40వేల వరకు ఖర్చు అయ్యింది. కానీ మార్కెట్‌కు పంపిస్తే నాకు ఒక్క రూపాయి కూడా రాలేదు. ఆటోచార్జీలు మీద పడ్డాయి. వంకాయ కూడా వేశాను, దాని రేటు కూడా తక్కువగానే ఉంది. రెండు పంటలు వేసి నష్ట పోయిన. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పుష్పమ్మ, మహిళా రైతు, నాగిరెడ్డిపల్లి

లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జహీరాబాద్, ఫిబ్రవరి 16: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసనిస్తుందని న్యాల్‌కల్ మండలంలోని గుంజోట్టి బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశాల మేరకు గుంజోట్టి గ్రామానికి చెందిన మారుతికి సీఎంఎఫ్ కింద మంజూరైన రూ.5,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్, సంగన్న పాల్గొన్నారు.

గైర్హాజరైన వారికి రేపటి నుంచి
ఇంటర్ ప్రాక్టికల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు గైర్హాజరైన జనరల్, వొకేషనల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ కార్యదర్శి మరో అవకాశం కల్పించారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గైర్హాజరైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో మహా పడి పూజ

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 15: మండలంలోని కరస్‌గుత్తిలో ఆదివారం నారాయణఖేడ్ పురోహితుడు మోహన్‌జోషి ఆధ్వర్యంలో మహా పడి పూజను భక్తి శ్రద్ధతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు చేసిన భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాలతోనే మానవజన్మకు సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శివస్వాములు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివశక్తి జాతీయ అధ్యక్షుడు కరుణాకర్

ధర్మ రక్షా దీక్ష

సదాశివపేట, ఫిబ్రవరి 16: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శివశక్తి ఆధ్యాత్మిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ధర్మ రక్షా దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శివశక్తి వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ సుగ్గుణ హాజరై మాట్లాడారు. హిందువులపై జరిగే దాడులను చట్టాలను గౌరవిస్తూ ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ప్రతి హిందువు చట్టాలు, రాజ్యాంగానికి లోబడి ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రధాన కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణ మూర్తి, శివశక్తి జాతీయ ప్రధాన కార్యదర్శి కల్యాణ్‌కుమార్ చెట్టుపల్లి, శవశక్తి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

జహీరాబాద్, ఫిబ్రవరి 16: బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 11గంటలకు నిర్వహించనున్న సదస్సుకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి లలితకుమారి, జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ హాజరవుతున్నారని తెలిపారు.నియోజకవర్గంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

కంగ్టి ఫిబ్రవరి 16: డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కంగ్టిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని భూతంపూర్ గ్రామానికి చెందిన అశోక్ పాటిల్, మండలంలోని తుర్కవడగామ గ్రామంలో జరిగిన నిశ్చితార్థానికి హాజరై తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కంగ్టి పట్టణంలో డివైడర్‌ను ఢీకొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్సై విజయ్‌కుమార్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం నారాయణఖేడ్ దవాఖానకు తరలించారు.

సజావుగా 'కే సాట్'

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16: ఈ అభ్యాస్ అనుబంధ పాఠశాల సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాల విద్యానగర్ కేంద్రంలో ఆదివారం కేసాట్ పరీక్ష సజావుగా జరిగింది. ఈ పరీక్షకు 25 పాఠశాలల నుంచి 950 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యానగర్ పాఠశాల కరెస్పాండెంట్ ఈ ఆంథోనీరెడ్డి, సీఈవో ఫణిపవన్ మాట్లాడుతూ..ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణలోని 255 అనుబంధ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం పదేండ్లుగా రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(కేసాట్)ను రెండు స్థాయిల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 11వ కేసాట్‌లో భాగంగా రాష్ట్రంలో 55 వేల మంది విద్యార్థులు తమ పాఠశాలల్లో మొదటిస్థాయి పరీక్ష రాయగా, రెండో స్థాయి పరీక్షను ఏకకాలంలో రాష్ట్రంలోని 15 కేంద్రాల్లో నిర్వహించామన్నాని చెప్పారు. ఈ పరీక్షకు 15000 మంది విద్యార్థులు హాజరయ్యారని వారు వివరించారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ వైస్ ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు

పారిశ్రామికవేత్తల నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న ఆర్వో నర్సింహులు

జిన్నారం, ఫిబ్రవరి 16: మున్సిపాలిటీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పన్నులు కీలకమని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమల ప్రతినిధుల నుంచి ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశ్రామికవాడలోని జెనెక్స్ లాబొరేటరీస్ తరపున ఇండస్ట్రియల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాయుడు రూ.లక్షా 72 వేలను చెక్కురూపంలో మున్సిపల్ అధికారులకు చెల్లించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో బృందాలను ఏర్పాటు చేసి పన్ను వసూలు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ప్రారంభానికి ముందే ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆలస్యం చేస్తే ప్రతినెలా అదనంగా 2శాతం అపరాధ రుసుముతో చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. అదనపు చెల్లింపుల బారిన పడకుండా గృహ యజమానులు, పారిశ్రామికవేత్తలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని సూచించారు. చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు అందించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సకాలంలో ఆస్తి చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింహులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన బీఆర్‌ఎస్ నేతలు

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 16: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కుమార్తె వివాహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరయ్యారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రమాదేవి దంపతుల కుమార్తె జాగృతిసాయి వివాహం శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ కుమారుడు రాగం అనిరుద్‌యాదవ్‌తో కొండాపూర్‌లోని హైటెక్స్‌లో జరిగింది. వివాహానికి కేటీఆర్, హరీశ్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, రాగం నాగేందర్ యాదవ్‌లతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతాప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, సోమిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్‌చారి, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
పుట్టినరోజు వేడుకలు

గుమ్మడిదల, ఫిబ్రవరి16: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లిలో నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరహరి తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు బొంతపల్లి హైస్కూల్ సమీపంలో తొలి ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి ఉమ్మడి జిన్నారం మండలవ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. బొంతపల్లి వీరభద్రనగర్‌లో దివంగత నాయకుడు గౌరీశంకర్ గౌడ్ సంతాప సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

బంజారాలు అన్నిరంగాల్లో రాణించాలి

సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఫిబ్రవరి16: బంజారాలు అన్నిరంగాల్లో రాణించాలని కార్పొరేటర్ పుష్పానగేశ్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శనివారం రాత్రి బంజారాల ఆధ్వర్యంలో జరిగిన సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సేవాలాల్ మహరాజ్‌కు గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంజారాలందరూ ఐకమత్యంతో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. గిరిజనులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజంలో సముచిత గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కరికె సత్యనారాయణ, నర్సింగ్ గౌడ్, పరమేశ్, బంజారాలు పాల్గొన్నారు.

మల్లన్న జాతరలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మల్లన్న జాతరలో ఎమ్మెల్యే పూజలు

హత్నూర, ఫిబ్రవరి16: హత్నూర మండలం పన్యాల గ్రామంలో నిర్వహిస్తున్న మల్లన్న జాతరలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తిభావంతో జాతరలు జరుపుకోవాలన్నారు. జాతరకు హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని పూజారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రాంచంద్రారెడ్డి, కృష్ణ యాదవ్, వీరేందర్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

నల్లవల్లి మేడాలమ్మ ఆలయంలో పల్లకి సేవలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

కనులపండువగా మేడాలమ్మ తల్లి జాతర

గుమ్మడిదల, ఫిబ్రవరి16: మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో వెలసిన మేడాలమ్మతల్లి ఆలయంలో వార్షికోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు, పల్లకిసేవ అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సదానందరెడ్డి, ఉదయ్‌కుమార్, మహిపాల్ రెడ్డి, పద్మారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

కల్హేర్, ఫిబ్రవరి 16: తన తండ్రి చెరువులో పడి మృతి చెందే దుస్థితి లేదని,ఎవరో హత్య చేశారని అనుమానం ఉందని పోలీస్ జాగిలాలను తెప్పించాలని కుటుంబసభ్యులు పట్టుపట్టడడంతో పోలీస్ జాగిలాలు తెప్పించి విచారణ చేపట్టిన ఘటన కల్హేర్ మండలం మిర్కాన్‌పేట్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశం, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూలి నాగయ్య(65) శనివారం రాత్రి 9గంటలకు తిని బయటకు వెళ్లి వస్తానని కోడలు పద్మతో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బోరు బావి వద్ద వెతకగా గ్రామ శివారులోని నాగనికుంట గట్టుపై నాగయ్య బట్టలు కనిపించాయి. కోడలు గుర్తుపట్టి కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీసేందుకు యత్నించగా మృతిపై అనుమానాలు ఉన్నాయని, పోలీస్ జాగిలాలు తెప్పించి విచారణ చేపట్టే వరకు మృత దేహాన్ని చెరువులోంచి తీసేదిలేదని కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు జాగిలాలను తెప్పించి విచారణ చేపట్టారు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్‌లో యువకుడి హత్య

అమీన్‌పూర్ ఫిబ్రవరి 16 బావమరిది సొంత బావను హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని సోమలతండాకు చెందిన బానోత్ గోపాల్ (42)జీవనోపాధి కోసం పడేండ్ల క్రితం భార్యాపిల్లలతో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌కు వచ్చి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గోపాల్ బావమరిది నరేశ్‌నాయక్ బావపేరుతో జేసీబీ కొనుగోలు చేశాడు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం బావను చంపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఖేడ్'లో రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 16: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం నారాయణఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 11 గంటలకు నారాయణఖేడ్‌ని ఏరియా దవాఖానలో రక్తదాన శిబిరాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

తండ్రిని కాపాడబోయి కూతురు మృతి

అంతారంలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

మునిపల్లి, ఫిబ్రవరి 16: ఇంటి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో ముగ్గురి వ్యక్తుల మధ్య జరిగిన గొడవ ఓ తండ్రికి తీరనిలోటును మిగిలించింది. తండ్రిని కాపాడబోయి కూతురి ప్రాణాలను బలితీసుకున్న ఘటన మండల పరిధిలోని అంతారంలో అలస్యంగా వెలుగులోకి వచ్చింది. మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 11న రాత్రి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మలవిసర్జన చేస్తుండగా ఇంటి పక్కనున్న వీరారెడ్డి, విజయ్ రెడ్డి ఇక్కడ మలవిసర్జన ఎందుకు చేస్తున్నావ్ అంటూ ఇస్మాయిల్‌తో ఘర్షణకు దిగారు...ఇస్మాయిల్ గొడవపడుతున్నట్లు శబ్దాలు రావడంతో ఇస్మాయిల్ చిన్నకూతురు అలియాబేగం మా నాన్నను కొట్టకండి అంటూ అడ్డు రావడంతో ఆమెను పక్కకు నెట్టేస్తూ రాళ్లతో దాడి చేయడంతో అలియా బేగం(15)కు రాయి బలంగా తగలడంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయింది. తండ్రిని కాపాడబోయిన ఇస్మాయిల్ కూతురుని స్థానికుల సహకారంతో సంగారెడ్డి వెల్‌నెస్ దవాఖానకు తరలించి అక్కడ చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. నా కూతురును రాళ్లతో కొటి చంపిన వీరారెడ్డి, విజయ్‌రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి ఇస్మాయిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌నాయక్ తెలిపారు. మృతి చెందిన విద్యార్థిని అలియాబేగం మండలంలోని కంకోల్ జిల్లా పరిషత్ ఉర్దు మీడియం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నట్లు సమాచారం.

వీడిన మిస్సింగ్ కేసు మిస్టరీ

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

దశరథ్ మృతదేహం కోసం వెతుకుతున్న పోలీసులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 16: ఐదు రోజుల క్రితం అదృశ్యమైన నిజాంపేట్ మండలం రాంచందర్ తండాకు చెందిన దశరథ్ మృతదేహాన్ని ఆదివారం పోలీసులు కనుగొన్నారు. దశరథ్ హత్యకు గురైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలడంతో సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసు మిస్టరీ ఎట్టకేలకు వీడింది. దశరథ్‌ను తానే హత్య చేసినట్లు మెగ్యానాయక్ తండాకు చెందిన గోపాల్ శనివారం నారాయణఖేడ్ పోలీసుల ఎదుట లొంగిపోవడంతో ఆ దిశగా విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం గోపాల్ సహకారంతో దశరథ్ మృతదేహాన్ని మెగ్యానాయక్ తండా శివారులో కనుగొన్నారు. దశరథ్ అవయవాలను దారుణంగా ఎక్కడికక్కడ నరికి ఓ పెద్ద బండరాయి మాటున పెట్టినట్లు గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో మూటలు కట్టి తీసుకెళ్లారు. దశరథ్‌ను హత్య చేసిన తర్వాత అతడి బైక్‌ను సైతం దహనం చేసినట్లు గోపాల్ తెలపగా దగ్ధమైన బైక్‌ను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొన్నేండ్ల క్రితం మెగ్యానాయక్ తండాలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసిన దశరథ్ తన కూతురితో సన్నిహితంగా ఉంటున్నాడని గోపాల్, దశరథ్‌పై కక్ష పెంచుకుని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తుంది.

లభించిన దశరథ్ అవయవాలను మూటకట్టిన పోలీసులు

కమిటీ సభ్యులతో దాత నర్సింహులు

ఆలయానికి విరాళం

జిన్నారం ఫిబ్రవరి 16: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కొల్లూరు నర్సింహులు ముదిరాజ్ రూ.85 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశం గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విరాళ దాతను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, లింగం, మంద రమేశ్, బ్రహ్మేందర్ గౌడ్, నర్సింగరావు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అమీన్‌పూర్ తహసీల్దార్ బదిలీ

అమీన్‌పూర్ ఫిబ్రవరి 16:అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ ఆదివారం బదిలీఅయ్యారు. వివిధ కారణాల దృష్ట్యా జోగులాంబ గద్వాల్ జిల్లాకు బదిలీ చేస్తూ సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జనరల్ ఎలక్షన్ సమయంలో నల్లగొండ జిల్లా నుంచి అమీన్‌పూర్‌కు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. అనంతరం ఆమె బాధ్యతలు చేపట్టి విధి నిర్వహణలో భాగంగా అనేక అక్రమ నిర్మాణాలను కూల్చి వేసి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు.

ఓబీసీ మేలుకో..

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16: జాగో ఓబీసీ.. జాగో.. ఓబీసీ మేలుకో అని బీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణనలో నమోదు కాని వారికి మరొక అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఆయన పేర్కొన్నారు. అందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 040–21111111ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు చెబితే మళ్లీ మన ఇంటికి వచ్చి పేర్లు నమోదు చేసుకుంటారని ఆయన ఓబీసీలకు సూచించారు. కుల గణనలో పాల్గొని సామాజిక బాధ్యత నెరవేర్చుకోవాలని ఆయన కోరారు.

యూనిఫామ్ బిల్లులు ఇప్పించాలి

మాట్లాడుతున్న టైలరింగ్ యూనిట్ మహిళలు

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులకు కుట్టిన యూనిఫామ్ బిల్లులు ఇప్పించాలని మండలంలోని పోతారం(ఎస్) శ్రీశక్తి స్వశక్తి సంఘం టైలరింగ్ యూ నిట్ మహిళలు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నాలుగేండ్లుగా ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు కుట్టిన యూనిఫామ్‌ల బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్ ప్రాంతం ఉన్న సమయంలో త్వరగా బిల్లులు వచ్చేవని, సిద్దిపేట జిల్లాలో కలిసిన తర్వాత బిల్లులు ఆలస్యమవుతున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి త్వరగా బిల్లులు ఇప్పించాలని వారు కోరారు. సమావేశంలో శ్రీశక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్ మహిళలు కనకతార, లత, శారద, అనురాధ, లక్ష్మి, పద్మ, యమున, సంధ్య, మంజుల, స్వరూ ప, స్వప్న, రూప పాల్గొన్నారు.

అలరించిన అవధానం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 16: లలిత చంద్రమౌళీశ్వర ఆలయంలో అవధాని మారెపల్లి పట్వర్ధన్ ఆదివారం ఆరు అష్టావధానాలు చేసి అలరించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి వరకు అవధానం కొనసాగింది. అష్టావధానంతో సాహిత్య ప్రియులు ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ నిర్వాహకులు రాధాకృష్ణ, వృచ్ఛికులుగా రాజేశం, రాజయ్య, అశోక్, గాయిత్రీదేవి, భమరాంభిక, శ్రీదేవి, నాగేశ్వరావు, అనురాధ, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, నరసింహారావు, విద్యాచరణ్, నాగలత, బస్వరాజ్‌కుమార్, శిరీష, భావన, మాధవీలత, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి జాతర

ఝరాసంగం, ఫిబ్రవరి 16 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని మాచనూర్ గ్రామ శివారులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జాతరను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి అర్చకులు అభిషేక పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో భక్తి శ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని చేశారు. ఆలయ ఆవరణలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య అర్చకులు గణపతి, సుబ్రమణ్య స్వామి, నంది, నాగుల విగ్రహాలకు జాలభిషేకం నిర్వహించారు. జాతరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతోపాటు గ్రామస్తులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.